క్లుప్తంగా

ముమ్మరంగా శానిటేషన్ పనులు



డివైడర్‌పై గడ్డిని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నర్సాపూర్: సీఎం కేసీఆర్ నర్సాపూర్ మీదుగా మెదక్ వెళ్తున్నందున మున్సిపల్ అధికారులు జాతీయ రహదారిపై శానిటేషన్ పనులు పెద్ద ఎత్తున చేపడుతున్నారు. జాతీయ రహదారి డివైడర్‌పై పెరిగిన గడ్డిని తొలగించే పనులు చేపట్టడంతో పాటు డివైడర్‌పై ఉన్న చెట్ల కొమ్మలను కత్తిరించి అందంగా కన్పించేలా చేశారు. రోడ్డు పక్కన నిర్మించిన ఫుట్‌పాత్‌పై మొక్కలు నాటారు. రోడ్లపై ఉన్న చెత్త చెదారం సైతం ఎత్తేసే పనులు చేపడుతున్నారు.

బీజేపీని బూత్‌స్థాయిలో పటిష్ఠం చేస్తాం

పెద్దశంకరంపేట(మెదక్): బీజేపీని బూత్‌స్థాయిలో పటిష్ఠం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల బీజేపీ అధ్యక్షుడు కోనం విఠల్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రవాస్ యోజనలో భాగంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలో బసవ కల్యాణ్ ఎమ్మెల్యే శరణ్ షెల్గార్ పర్యటిస్తున్నారని బుధవారం పెద్దశంకరంపేట బీజేపీ కార్యాలయంలో బూత్ స్థాయి కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో మండల నాయకులు శ్రవణ్ కుమార్, కిషన్, కృష్ణ, సంగమేశ్వర్, సుధాకర్, రాజు, కుమార్, విజయ్‌కుమార్, అనిల్, సురేశ్, భూషణ్, బాబు రాథోడ్ పాల్గొన్నారు.

బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మనోహరాబాద్(తూప్రాన్): మహిళల ఆర్థిక ప్రగతికోసం బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ మేనేజర్ భాగ్య, కాళ్లకల్ సర్పంచ్ మల్లేశ్ సూచించారు. ఈ మేరకు కాళ్లకల్ న్యూ ఎంటర్‌ప్రైజెస్‌లో బ్యాంకు రుణం ద్వారా ఏర్పాటు చేసిన ఎంబ్రాయిడరీ మిషన్‌ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో నరసింహరెడ్డి, పెంటాగౌడ్, కృష్ణవేణి, కల్పన, సునంద, అనిత తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

పెద్దశంకరంపేట(మెదక్): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఈజీఎస్ ఏపీఓ సుధాకర్ అన్నారు. మంగళవారం పేటలోని పాత ఐబీ గెస్ట్‌హౌస్ ఖాళీ స్థలంలో సంపద వనాల కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా ఉపాధిహామీ కూలీలతో గుంతలను తీయించారు. త్వరలో పలు రకాల మొక్కలను నాటుతామన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది, టీఏలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ట్రాక్‌సూట్



ట్రాక్‌సూట్ అందిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): కిక్ బాక్సింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను చౌటకూరి గోవర్ధన్‌రెడ్డి అభినందించారు. ఈ నెల 23 నుంచి జార్ఖండ్ రాష్ట్రం రాంచిలో జరిగే పోటీలకు అర్హత సాధించిన 20 మంది క్రీడాకారులకు మంగళవారం స్పోర్ట్స్ ట్రాక్‌సూట్‌లను అందజేశారు. కిక్‌బాక్సింగ్ స్టేట్ జాయింట్ సెక్రటరీ, కోచ్ పోచయ్య, మాస్టర్లు రాములు, సుప్రియ, మహేష్‌గౌడ్, అభి/షాన్, సందీప్‌లు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేయొద్దు

కౌడిపల్లి(నర్సాపూర్): పిల్లలకు చిన్నతనంలో పెళ్లిళ్లు చేయడం వల్ల ఇబ్బందులు కలుగుతాయని, బాల్యవివాహాలు చేయొద్దని కార్వెడ్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ దుర్గమణి తెలిపారు. మంగళవారం మండలంలోని ధర్మాసాగర్ డాన్‌డాస్కో పాఠశాలలో విద్యార్థులకు కై లాష్ సత్యార్థి ఫౌండేషన్, కార్వెడ్ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, చిన్నపిల్లల అక్రమ రవాణా నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయొద్దన్నారు. చిన్న పిల్లల అక్రమ రవాణ చేయడం నేరమన్నారు. అలాంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. పిల్లలు ఏబీసీడీ ఫార్ములను పాటించాలన్నారు. పిల్లలకు బ్యాలవివాహాలు, అక్రమ రవాణా చేసినట్లయితే 100 లేదా 1098 ఫోన్ చేయాలని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల తిప్పలు

నర్సాపూర్: యూరియా ఎరువు బస్తాల కోసం రైతులు రోజు ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు. రైతులకు సరిపడా యూరియా ఎరువు అందుబాటులో లేనందున రైతులు రోజు ఇబ్బందులు పడుతున్నారు. రోజు ప్యాక్స్ ఆఫీసు వద్ద రైతులు బారులు తీరి యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. ప్యాక్స్ ఆఫీసుకు రోజు నాల్గు వందల నుంచి ఐదు వందల బస్తాల యూరియా రావడంతో ప్యాక్స్ సిబ్బంది అవి ఉన్నత వరకు అమ్మడంతో లైనులో చివరన నిలబడిన రైతులకు యూరియా లభించకపోతే మరునాడు రావాల్సి వస్తుంది. రోజు యూరియా కోసం రావాల్సి రావడంతో సమయం డబ్బులు వృథా అవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ స్టాకు ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

జన సమీకరణకు ఏర్పాట్లు : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

నర్సాపూర్: ఈనెల 23న మెదక్‌లో జరిగే సీఎం కేసీఆర్ సభకు వెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. బుధవారం మెదక్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొనేందుకు నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు ప్రజలను తరలించేందుకు ఏర్పాటు చేశామన్నారు. 650 డీసీఎంలు, బస్సులు, ఏడు వందల ఆటోలు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గం నుంచి 45 వేల మందిని తరలించేందుకు వాహనాలు సమకూరుస్తున్నట్లు తెలిపారు. సీఎం పాల్గొనే బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పార్టీ నాయకులను, కార్యకర్తలను కోరారు. ఆయన వెంట అసంఘటిత కార్మిక బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, మన్సూర్, నర్సింలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి పలువురి చేరిక

టేక్మాల్(మెదక్): మండలంలోని కొరంపల్లి సర్పంచ్ నాయికోటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు మంగళవారం అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ స్వగృహం పోతులబోగుడలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ నాయికోటి కిషన్, నాయికోటి చంద్రయ్య, తెల్లగొర్ల ముత్తయ్య, చలపల్లి కిషన్, చలపల్లి సురేశ్, బేగరి బాలకిష్టయ్య, శ్రీనివాస్, రాజు, కార్తీక్, దుర్గాప్రసాద్, దుర్గయ్య, దుర్గేశ్, శ్రీశైలం, శివరాజ్, నవీన్ కుమార్, సురేశ్‌లకు బీఆర్‌ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇందులో బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు వీరప్ప, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు ఇంటింటికీ తీసుకెళ్లాలి



యూసుఫ్‌పేటలో శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సురేశ్ షెట్టి



చేగుంట(తూప్రాన్): కేంద్ర పథకాల కరపత్రం అందిస్తున్న షోలాపూర్ ఎమ్మెల్యే

పాపన్నపేట(మెదక్): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని కర్ణాటక రాష్ట్ర ఉడిపి ఎమ్మెల్యే సురేశ్‌శెట్టి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్నందున కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలని కోరారు. వాటిని ప్రజలకు తెలియ పర్చాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో మళ్లీ బీజేపీని రావడం తథ్యమన్నారు. అంతకు ముందు ఏడుపాయల దుర్గమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం అమ్రియా తండాలో గిరిజనులతో కలసి భోజనం చేశారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు గడ్డ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనార్దన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, బిజయ్, పార్లమెంట్ విస్తారక్, మండలాధ్యక్షుడు సంతోశ్ చారి, సీనియర్ రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

బీజేపీని గెలిపించాలి

చేగుంట(తూప్రాన్): ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి బీజేపీని గెలిపించాలని మహారాష్ట్ర షోలాపూర్ ఎమ్మెల్యే మాజీమంత్రి సుభాశ్‌చంద్ర దేశ్‌ముఖ్ అన్నారు. మండల కేంద్రం చేగుంటలో సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పలువురు నాయకులు ప్రముఖులను దేశ్‌ముఖ్ కలిసి కేంద్రం అమలు చేసిన పథకాల కరపత్రం అందించారు. తెలంగాణలో బీజేపీకి ఒకసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్, నియోజకవర్గ కన్వీనర్ చారి, కోకన్వీనర్ గోవింద్, పాండు, సంతోష్‌రెడ్డి, నర్సింలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

హామీలు మరిచిన సీఎం

పాపన్నపేట(మెదక్): గతంలో మెదక్ ప్రజలకు ఇచ్చిన హామీలు సీఎం కేసీఆర్ మరిచిపోయారని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన పాపన్నపేటలో మాట్లాడుతూ.. ఘనపురం ప్రాజెక్టుకు రూ.100 కోట్లు ఏమయ్యాయని, ప్రాజెక్టు పనులు ఇంత వరకు పూర్తి కాలేదన్నారు. మంబోజిపల్లి షుగర్ ఫ్యాక్టరీ తాళాలు తెరచుకోలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో సిద్దిపేట, గజ్వేల్‌కు తప్ప మెదక్‌కు ఒరిగింది ఏమీ లేదన్నారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్ నాయక్, ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భగలాముఖి ఆలయంలో విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న గవర్నర్ కూతురు విజయలక్ష్మి

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో కొలువుదీరిన భగలాముఖి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. వేద పండితుడు శాస్త్రుల వేంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం చేసి, ప్రత్యేక మహోత్సవాలు నిర్వహించారు. భగలాముఖి అమ్మవారిని హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ కూతురు విజయలక్ష్మి దర్శించుకున్నారు. అలాగే అతిథి మాసపత్రిక చీఫ్ ఎడిటర్ వేంకటేశ్వర్‌రావు, డీఈఓ రాధకిషన్, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎల్లమ్మ ఆలయంలో భక్తులు పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని గౌడసంఘం సభ్యులు రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన సొసైటీ వైస్ చైర్మన్ చిన్నంరెడ్డి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకుడు రాజేశ్వరశర్మ పూజలు నిర్వహించి, భక్తులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా రైతుబంధు సమితి సభ్యులు శివాంజనేయులు, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు కృష్ణాగౌడ్, ఆత్మకమిటీ డైరెక్టర్ మోతిలాల్‌గౌడ్, మాజీ డైరెక్టర్ చంద్రం, నాయకులు దుర్గాగౌడ్, కృష్ణానాయక్, గోపాల్‌రెడ్డి, గొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో ముదిరాజ్‌లకు అన్యాయం

నర్సాపూర్‌రూరల్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీట్లు కేటాయింపులో సీఎం కేసీఆర్ ప్రకటించిన తొలి జాబితాలో ముదిరాజ్‌లకు అన్యాయం జరిగిందని ముదిరాజ్ సంఘం నాయకుడు, రుస్తుంపేట మాజీ సర్పంచ్ గుర్రాల అశోక్ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 లక్షల మంది ఉన్న ముదిరాజులకు బీఆర్‌ఎస్‌లో ఒక్క సీటు కూడా ఇవ్వక పోవడం అన్యాయం అన్నారు. ముదిరాజ్‌లు ఇప్పుడైనా కళ్లు తెరిచి ఒకసారి ఆలోచించాలన్నారు. ముదిరాజులు చేపలు పట్టుకొని ఓట్లు వేయటానికి పనికి వస్తారా? అని ప్రశ్నించారు. ముదిరాజులను ఇంత చిన్న చూపు చూడటం బాధాకరం అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ ఎస్ పార్టీకి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలన్నారు. మిగతా పార్టీలు కులాల వారీగా ఎమ్మెల్యే సీట్లు కేటాయించి వారిని గౌరవించాలని డిమాండ్ చేశారు.

రామాయంపేట(మెదక్): బీఆర్‌ఎస్ తరఫున అసెంబ్లీ ఎన్నికల టికెట్ల కేటాయింపు విషయమై జనాభాలో 40 శాతం ఉన్న ముదిరాజ్‌లకు తీరని అన్యాయం జరిగిందని నార్సింగి మండలానికి చెందిన ముదిరాజ్ సంఘం ప్రతినిధులు వాపోయారు. వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. మొదటి లిస్టులో ఒక్క ముదిరాజ్ కులానికి చెందిన వారి పేరు కూడా లేకపోవడం తమను అవమానపర్చడమేనని వాపోయారు. అధికార బీఆర్‌ఎస్‌కు తమ ఓట్లు మాత్రమే కావాలని, తమ శ్రేయస్సు అవసరం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బోళ్ల శ్రీనివాస్, పోచమ్మల భిక్షపతి, చంద్రం, ఆంజనేయులు, గుర్రాల స్వామి, సిద్దిరాంలు, నర్సింలు, ఆంజనేయులు ఉన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ సీట్ల విషయంలో బీసీలపై చిన్న చూపుచూడడం సరికాదని నర్సాపూర్ టీడీపీ ఇన్‌చార్జ్ రమణ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో బీసీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ 115 మంది అభ్యర్థులను ప్రకటిస్తే ఒక్క ముదిరాజ్‌కు కూడా అవకాశం కల్పించలేదన్నారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ ఉపాధ్యక్షుడు నర్సింలు, నాయకులు రమేశ్, విష్ణు, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడున్నర గంటలే..

- అధికారుల ఇష్టారాజ్యాం
- 12 వచ్చి, 3:30 గంటలకు వెళ్తున్నారు.
- అల్లాదుర్గం పీఆర్ సబ్ డివిజన్ దుస్థితి

అల్లాదుర్గం(మెదక్): ఉదయం 10 గంటలకు కార్యాలయానికి రావాల్సిన సిబ్బంది 11 నుంచి 12 గంటలకు వచ్చి.. తిరిగి 3:30 గంటలకే ఇళ్లకు వెళ్లి పోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక సిబ్బంది ఇష్టరాజ్యాంగా విధులు నిర్వహిస్తున్నారు. మరో వైపు కాంట్రాక్టర్లు పర్సంటేజీలు ఇచ్చేది ఉంటే రాత్రి 8 గంటల వరకు విధుల్లో ఉంటున్నారు. మంగళవారం అల్లాదుర్గం పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయంలో సిబ్బంది సాయంత్రం 3:30 గంటలకే వెళ్లి పోయారు.



అల్లాదుర్గం పీఆర్ కార్యాలయంలో 3:30 గంటలకే సిబ్బంది వెళ్లిపోతే ఖాళీగా ఉన్న కుర్చీలు

సీఎంకు కృతజ్ఞతగా తరలిరావాలి



మాట్లాడుతున్న సునీతారెడ్డి



తూప్రాన్‌లో నాయకులతో వంటేరు ప్రతాప్‌రెడ్డి

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

నర్సాపూర్: రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటు పడుతున్న సీఎంకు కృతజ్ఞతలు తెలిపేందుకు అందరూ మెదక్ సభకు తరలిరావాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి కోరారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. సుమారు 14 ఏళ్ల పాటు పోరాటం చేసి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, దానిని బంగారు తెలంగాణ చేసేందుకు నిత్యం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులతో పాటు అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరేలా సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని వివరించారు. కాగా చిన్న జిల్లాలు ఏర్పాటు చేస్తే ప్రజలకు అధికార యంత్రాంగం చేరువై ప్రభుత్వ సేవలు మరింత వేగంగా అందుతాయన్న ఉద్దేశ్యంతో పాటు మెదక్ ప్రజల చిరకాల కోరికను నెరవేర్చే ఉద్దేశ్యంతో మెదక్‌ను జిల్లా కేంద్రంగా ప్రకటించి, కేంద్రంలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం ఇతర కార్యాలయాలు నిర్మించారన్నారు. వాటిని సీఎం కేసీఆర్ బుధవారం ప్రారంభించిన అనంతరం మెదక్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారని వివరించారు. ఆమె వెంట నర్సాపూర్ వైస్ చైర్మన్ నయీమోద్దీన్ బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, షేక్ హుస్సేన్, నర్సింలు, శ్రీశైలం పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): జిల్లా కేంద్రం మెదక్‌లో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయా లని జిల్లా సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సభ విజయవంతం చేసేందుకు సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల నుండి భారీ సంఖ్యలో ప్రజలను సీఎం సభకు తరలించాలని ఆయన వారి కి సూచించారు. ఎంపీపీ జంగం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మురళి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తూప్రాన్: సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోంచి ప్రజలను అధిక సంఖ్యలో మెదక్ తరలించాలన్నారు. ఈ సమావేశంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, సత్యనారాయణగౌడ్, కిష్టారెడ్డి, సతీష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతలు గ్రామాల్లోనే ఉండాలి

- మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): ఎన్నికలయ్యే వరకు బీఆర్‌ఎస్ నాయకులు గ్రామాల్లోనే ఉండాలని మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నార్సింగి మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల మధ్య సయోధ్య లేకుంటే పార్టీకి నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని ఎంపీ పిలుపునిచ్చారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటు వేస్తే అది చెల్లని ఓటుగా మారుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు అందని ఇల్లు లేదని, కార్యకర్తలు ఐకమత్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

అంతకుముందు కార్యకర్తలు, నాయకులు ఎంపీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, నార్సింగి, దౌల్తాబాద్ మండలాల పార్టీ అధ్యక్షులు బాబు, రణం శ్రీనివాస్‌గౌడ్, మండల రైతుబంధు అధ్యక్షుడు లింగారెడ్డి, సర్పంచ్ ఎర్రం అశోక్, ఎంపీటీసీలు, గ్రామ శాఖల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

పోటాపోటీగా ఫ్లెక్సీల ఏర్పాటు



నర్సాపూర్ చౌరస్తాలో మదన్‌రెడ్డి, సునీతారెడ్డిలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

నర్సాపూర్: సీఎం కేసీఆర్ ఈనెల 23న నర్సాపూర్ మీదుగా మెదక్ వెళ్తున్నందున బీఆర్‌ఎస్ టికెట్ ఆశిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇద్దరు పార్టీ టికెట్ ఆశిస్తున్నందున సీఎం దృష్టిలో పడలాన్న ఆశతో పట్టణం మీదుగా ఉన్న జాతీయ రహదారిపై డివైడర్‌పై ఏర్పాటు చేయడంతో పాటు చౌరస్తాలో సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రి హరీశ్‌రావు తదితరుల ఫొటోలతో కూడిన పెద్ద పెద్ద ఫ్లెక్సీలను మదన్‌రెడ్డి, సునీతారెడ్డిలు ఎవరికి వారు జాతీయ రహదారిపై ఏర్పాటు చేయించారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎం సభకు భారీగా తరలిరావాలి

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 23న మెదక్‌లో సీఎం కేసీఆర్ నిర్వహించే భారీ బహిరంగసభకు ప్రజలు భారీగా తరలి రావాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ కుమార్‌యాదవ్, మండలాధ్యక్షుడు రామాగౌడ్, ఎంపీపీ రాజునాయక్ తెలిపారు. మండలం నుంచి 7 వేల మంది కార్యకర్తలను తరలించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ రేగోడ్‌ను సంగారెడ్డి జిల్లాలో కలపాలి

రేగోడ్(మెదక్): రేగోడ్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలని స్థానిక యువత ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరుతున్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ... మెదక్ జిల్లాలో రేగోడ్ మండలం ఉండటం వలన అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నా.. పట్టించుకోవడం లేదని తెలిపారు. సీఎం కేసీఆర్ రేగోడ్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలిపేలా ప్రకటించి నెరవేర్చాలని కోరారు.

◆ సీఎం కేసీఆర్ పర్యటనపై ఆరా

మనోహరాబాద్(తూప్రాన్): నేడు సీఎం కేసీఆర్ పర్యటన పురస్కరించుకొని మండల కేంద్రం మనోహరాబాద్‌లో జన సమీకరణపై జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి హరీశ్‌రావు అడిగి తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ మండలం నుంచి ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, మండల ఇన్‌చార్జ్ యాదగిరి తెలిపారు.

◆ పారిశుధ్య పనులు

కౌడిపల్లి(నర్సాపూర్): సీఎం కేసీఆర్ మెదక్ వస్తుండటంతో జాతీయ రహదారి శుభ్రమైంది. వారం రోజులుగా అధికారులు 765డి జాతీయ రహదారికి ఇరువైపుల హరితహారం మొక్కలు నాటి, పిచ్చిమొక్కలు తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్ల, కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులు ఉన్నారు.

◆ ఎల్లమ్మ ఆలయంలో పూజలు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి మంగళవారం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మనోహర్, అంసాన్‌పల్లి సర్పంచ్ శ్రీనివాస్ నాయకులు శేఖర్, ప్రభాకర్, కృష్ణాగౌడ్, తదితరులు ఉన్నారు.

◆ ప్రజల్లోకి కాంగ్రెస్ డిక్లరేషన్

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తామని వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్ తెలిపారు. మంగళవారం మండంలోని గజగట్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ ఎంపీటీసీల ఫోరం ఆధ్వర్యంలో కాంగ్రెస్ డిక్లరేషన్ పత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్, గజగట్లపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకుడు నర్సాగౌడ్‌లున్నారు.

◆ పశువైద్య శిబిరం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కామారం గ్రామంలో మంగళవారం సత్యసాయి సేవ సమితి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ గీతామాలిక, పున్నయ్య, సర్పంచ్ యాదగిరి, సత్యసాయి సేవ సమితి కోఆర్డినేటర్స్ బాలకృష్ణ, చంద్రమౌళి, వెంకట్‌గౌడ్, సత్యనారాయణ, సాయికృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

◆ టై, బెల్ట్‌ల పంపిణీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని బండపోతుగల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం మండల కో ఆప్షన్ సభ్యుడు షఫీ తన సొంత ఖర్చులతో టై, బెల్ట్‌లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం రాంచంద్రారెడ్డి, సర్పంచ్ ఇస్తారీ, ఎస్‌ఎంసీ చైర్మన్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

◆ రోడ్డు ప్రమాదంలో బీఆర్‌ఎస్ నాయకులకు గాయాలు

చేగుంట(తూప్రాన్): ఎమ్మెల్యే టికెట్ ఖరారైన బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసేందుకు వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు కారు ప్రమాదంలో గాయాలైన సంఘటన చేగుంట శివారులోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల బీఆర్‌ఎస్ నాయకులు బాజిరెడ్డిగోవర్ధన్‌ను కలిసేందుకు కారులో హైదరాబాద్ వెళ్తున్నారు. ఈ క్రమంలో వారు వెళ్తున్న కారును చిన్నశివునూర్ యూటర్న్ వద్ద బొలేరో ఢీ కొంది. ఈ ప్రమాదంలో రాజిరెడ్డి, సత్తయ్య, కొండారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లకు గాయాలయ్యాయి. ఈ సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులకు తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్‌ఐ హరీశ్ తెలిపారు.

◆ తప్పుడు ప్రచారం మానుకోవాలి

టేక్మాల్(మెదక్): బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై తప్పుడు ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్ తెలిపారు. మంగళవారం ఆయన టేక్మాల్‌లో మాట్లాడారు.